సాక్షి కాకినాడ

మంగళవారం । 18 । జూలై । 2023



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు నూకల అమ్మాజీ (ఏలూరు) చినవెంకన్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం రూ.1,00,001 విరాళం సమర్పించారు.




రాత్రిపూట రక్తచరిత

ఇద్దరు దుర్మార్గులు రాత్రిపూట అలజడి రేపారు.. కత్తులతో భయానక వాతావరణం సృష్టించారు.. ఓ డ్రైవర్‌ను కత్తితో పొడవడమే కాకుండా మహిళను హత్య చేశారు.

- IIలో▸

కడలిలోకి 49,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 49,600 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9 అడుగులకు చేరింది.

జ్వరంపై సమరం

- సీజనల్ వ్యాధులపై ఇంటింటా ముమ్మరంగా సర్వే
- డెంగీ, మలేరియా, బోదకాలు నివారణకు చర్యలు
- 9.28 లక్షల ఇళ్లను సందర్శిస్తున్న బృందాలు



కరపలోని ఓ ఇంట్లో ఫీవర్ సర్వే చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు

కాకినాడ సిటీ: సీజనల్ వ్యాధులపై జిల్లా యంత్రాంగం సమరభేరి మోగించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మలేరియా నివారణ అధికారి పర్యవేక్షణలో 50వ విడత ఫీవర్ సర్వేకు ఇంటింటా శ్రీకారం చుట్టింది. వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతూనే మరోవైపు ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వలంటీర్లతో కూడిన బృందం ఇంటింటికీ వెళ్లి డెంగీ, మలేరియా, వివిధ జ్వరాలతో బాధ పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా చూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లోని మొత్తం 22.27 లక్షల జనాభాను సర్వే చేయనున్నారు. మొత్తం 9.28 లక్షల ఇళ్లను సందర్శించనున్నారు. ఈ నెల 11న సర్వే ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ 76 వేల ఇళ్లను సందర్శించారు. మరో 10 రోజుల పాటు సర్వే నిర్వహించి నూరు శాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

బాధితులను గుర్తిస్తూ.. చికిత్స అందిస్తూ..

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల బెడద పెరిగి, వివిధ రకాల జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. మలేరియా, డెంగీ, బోదకాలు, డయేరియా వంటివి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో వీటిని అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తుగా చర్యలు చేపట్టింది. ఈ వ్యాధులన్నింటికీ ముఖ్య లక్షణం జ్వరం కావడంతో ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టింది. జిల్లాలోని మొత్తం 365 గ్రామ పంచాయతీల్లోనూ ప్రతి ఇంటికీ వెళ్తున్న వైద్య సిబ్బంది జ్వరాలతో బాధ పడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఆ వివరాలను ఫీవర్ సర్వే యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఏ మాత్రం జ్వరం లక్షణాలు కనిపించినా మలేరియా, డెంగీ వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. **జ్వరం ఎన్ని రోజుల నుంచి ఉంది, ఇతర లక్షణాలేమిటో తెలుసుకుని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించి, చికిత్స అందిస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తే బాధితులకు వెంటనే** వైద్య సేవలు అందించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి జ్వరం ఉన్నట్టు గుర్తిస్తే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించడంతో పాటు అక్కడ పారిశుద్ధ్యం మెరుగుదలకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ సర్వే సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎంతో ఉపకరిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

పక్కాగా చర్యలు

గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలం వస్తే చాలు.. ప్రజల్లో వణుకు పుట్టేది. పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో దోమలు వృద్ధి చెందేవి. సీజనల్ వ్యాధులతో మరణాలు సంభవించినా పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. కనీసం మందులు కూడా అందించలేని దుస్థితి. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ పారిశుద్ధ్య పనులను పక్కా ప్రణాళికతో నిరంతరం నిర్వహిస్తూ, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. అటవీ, క్వారీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు దోమ తెరలు పంపిణీ చేయడమే కాకుండా ఫీవర్ సర్వే చేపడుతూ జ్వర పీడితులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధుల తీవ్రత ఏటేటా తగ్గుముఖం పడుతోంది.

వినూత్న కార్యక్రమాలతో..

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్), జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఆదర్శ గ్రామాలు, ఫ్రైడే డ్రైడే వంటి వినూత్న కార్యక్రమాలతో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్లాప్ ప్రోగ్రామ్ ద్వారా ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేసి రీ సైక్లింగ్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆదర్శ గ్రామాల పేరుతో గ్రామ స్థాయిలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించడమే కాకుండా పచ్చదనానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. చెరువుల్లో గంబూషియా చేపలు, నీరు నిల్వ ఉన్న కుంటల్లో ఆయిల్ బాల్స్ వంటివి వేస్తూ దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఆవాస ప్రాంతాల్లో ఫాగింగ్ వంటివి నిర్వహిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



అధికార యంత్రాంగం తీసుకునే చర్యలతో పాటు ప్రజలు సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తిపై అవగాహనతో ఉండాలి. ఫీవర్ సర్వేకు సహకరించాలి. ఇంట్లో, పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందాలి. సీజనల్ వ్యాధులు, దోమల వృద్ధిని అరికట్టేందుకు వైద్య, ఆరోగ్య అధికారులతో పాటు పంచాయతీలు, మున్సిపాలిటీ అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకున్నాం. ఫీవర్ సర్వే నుంచి పారిశుద్ధ్య పనుల వరకూ నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్

న్యూస్‌రీల్

వైభవంగా సప్తనదీ జలాభిషేకం



సప్తనదీ జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి సోమవారం వైభవంగా సప్తనదీ జలాభిషేకం నిర్వహించారు. ఆషాఢ మాసోత్సవాల ముగింపు సందర్భంగా వేద పండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, శశాంక్ త్రిపాఠి, పురుషోత్తమశర్మ, ధర్మకర్తల మండలి కో ఆప్షన్ సభ్యుడు డి.త్రినాథరావు తదితరులు సప్తనదీ నదీజలాలకు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు అమ్మవారి పంచలోహ విగ్రహాలను సప్తనదీ జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల పూలతో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. లోవలో జూన్ 17న ప్రారంభమైన ఆషాఢ మాసోత్సవాలు ముగిశాయని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

కాకినాడ సిటీ: కలెక్టరేట్ స్పందనలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వికాస ద్వారా వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ కృతికా శుక్లాను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పి.అనిత ఐసీఐసీఐ బ్యాంకులో నెలకు రూ.19 వేల జీతంతో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. పి.ప్రశాంతి ఎస్‌డీవీవీఎల్ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలో జూనియర్ హెచ్‌ఆర్‌గా రూ.16 వేల జీతంతో, కేవైవీఎం రుద్ర సీనియర్ ఇంజినీర్‌గా, వి.విజయకుమార్ సైట్ ఇంజినీర్‌గా రూ.15 వేల చొప్పున, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పి.ప్రజీత రూ.14 వేలు, పి.దుర్గాప్రసాద్, పి.మేఘన రూ.12 వేల వేతనంతో, పి.మేఘన రూ.12 వేల వేతనంతో రిసెప్షనిస్ట్‌గా, ఎ.విజయ్ రూ.13 వేల జీతంతో బజాజ్ కాపిటల్ ఆపరేషన్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగాలు పొందారని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు వివరించారు.

స్పందనకు 436 అర్జీలు



మహిళ సమస్యను స్వయంగా తెలుసుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం – జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి 436 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, బీసీ సంక్షేమ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చక్కటి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువ అర్జీలు నమోదవుతున్నాయన్నారు. అర్జీదారులను నేరుగా కలిసి, వివరాలు సేకరించి, వారు సంతృప్తి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యల వివరాలను అర్జీదారుకు అర్థమయ్యేలా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు.

22 కేజీల గంజాయి పట్టివేత

శంఖవరం: జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని అన్నవరం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి తమిళనాడుకు అక్రమంగా గంజాయి తరలిస్తూండగా కత్తిపూడి శివారున పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. కాకినాడకు చెందిన ర్యాలీ మహేష్ కృష్ణంరాజు, కాశీ సహిద, గొర్ల సింహాద్రిలు.. తమిళనాడుకు చెందిన శెంటిమల్ సెల్వన్, రవిశంకర్‌కు గంజాయిని విక్రయిస్తూండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కిశోర్‌బాబు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్, అడిషనల్ ఎస్సై జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

47 వాహనాలు.. రూ.7.89 లక్షలు

కాకినాడ క్రైం: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పర్యవేక్షణలో కాకినాడలోని ఏఆర్ మైదానంలో సోమవారం ద్విచక్ర వాహనాల వేలం జరిగింది. ఈ వాహనాలను మద్యం సంబంధిత నేరాల్లో పట్టుకున్నారు. 47 వాహనాలను స్వాధీనం చేసుకోగా, వీటిని జీఎస్‌టీతో కలిపి రూ.7.89 లక్షలకు విక్రయించారు. సెబ్ అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో ఈ వేలం జరిగింది.

ఆ ప్రచారం అవాస్తవం

అన్నవరం: దేవస్థానంలో కొందరు దళితులు బ్రోకర్లుగా పని చేస్తున్నారని తానన్నట్టు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దీనిపై ఆయనను దళిత నాయకులు సోమవారం కలిశారు. దళితులను దళారీలు అని ఈఓ అన్నట్టు జరుగుతున్న ప్రచారంపై వివరణ కోరారు. దీనిపై ఈఓ స్పందిస్తూ తాను అలా అనలేదని, తానన్నట్టు ఎవరైనా తప్పుగా వార్త రాస్తే దానిని ఖండిస్తున్నానని తెలిపారు.

థ్యాంక్యూ సీఎం సార్..

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు



సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన ఆర్టీసీ డీఎం సత్యనారాయణమూర్తి, ఉద్యోగులు

అమలాపురం రూరల్: థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సోమవారం అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు సంబరాలు జరుపుకొన్నారు. రాష్ట్రంలో 53 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హయ్యర్ పెన్షన్ స్కీమ్‌లో అవకాశం కల్పించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన మేలుతో ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్డ్ అయితే రూ.40 వేల వరకూ పింఛన్ అందుతుందన్నారు. 2014 నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులనూ హయ్యర్ పెన్షన్ స్కీమ్‌లో చేర్చడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. అనంతరం సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఈ జీఆర్‌ఎల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన కౌలు రైతు కార్డుల పంపిణీ

- సత్వరం రుణాల మంజూరుకు చర్యల చేపట్టాలి
- అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

కాకినాడ సిటీ: జిల్లాలో కౌలు రైతు కార్డుల (సీసీఆర్‌సీ) పంపిణీని వేగవంతం చేయాలని, అర్హులను గుర్తించి, సత్వరమే పంట రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. డ్రాపౌట్ల సర్వే, నాడు–నేడు పనులు, జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్ల పంపిణీ, సంక్షిప్త ఓటర్ల జాబితా తనిఖీ, కౌలు రైతు కార్డుల పంపిణీ, పంట రుణాల మంజూరు, ఈ–క్రాప్ బుకింగ్, జగనన్న పాల వెల్లువ, బీఎంసీయూ గ్రౌండింగ్, ప్రభుత్వ శాశ్వత భవనాల పురోగతి తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి క్షేత్ర స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకూ సుమారు 37 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఈ నెలాఖరుకు నూరు శాతం సీసీఆర్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న కౌలు రైతులను గుర్తించి పంట రుణాల మంజూరు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఆసక్తి ఉన్న కౌలు రైతులను బ్యాంక్ అధికారులతో అనుసంధానం చేసి, రుణాల మంజూరుకు అసరమైన డాక్యుమెంటేషన్ పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఈఆర్‌ఓలు ఇంటింటా తనిఖీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రాపౌట్లను గుర్తించి, వెంటనే పాఠశాలల్లో తిరిగి చేర్పించాలని చెప్పారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే సక్రమంగా నిర్వహించి, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. మన బడి నాడు–నేడు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకాన్ని ఆగస్టులో ప్రారంభించనున్నందున ఎంపిక చేసిన గ్రామాల్లో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల (బీఎంసీయూ) గ్రౌండింగ్ చేపట్టాలని చెప్పారు. నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.సూర్యప్రకాశరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ ఎం.శ్రీనివాస్, కాకినాడ డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఆరోపణలు రాజకీయ కుట్ర

- మంత్రి దాడిశెట్టి రాజా
- పాతకొట్టాంలో 'జగనన్న సురక్ష'



పాతకొట్టాంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: ప్రజలకు ఎంతో మంచి చేస్తున్న వలంటీర్లపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలు రాజకీయ కుట్రలో భాగమేనని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని పాతకొట్టాం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ పసగడుగుల వరహాలు అధ్యక్షతన సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి 50 కుటుంబాలకు సుపరిచితులైన వ్యక్తినే వలంటీర్‌గా నియమించామని అన్నారు. తన పరిధిలోని ప్రతి ఒక్కరి కష్టంలోనూ వలంటీర్లు భాగస్వాములై నిస్వార్థంగా సేవలందిస్తున్నారన్నారు. ఒక్క పైసా అవినీతికి కానీ, లంచానికి కానీ తావు లేకుండా సేవ చేస్తున్న వలంటీర్లపై చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ/వలంటీర్ వ్యవస్థల వైపు దేశంలోని అన్ని రాష్ట్రాలూ చూస్తున్నాయన్నారు. ఒక విజన్‌తో సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూంటే ప్రతిపక్షాలు, పచ్చ మీడియా ఓర్వలేకపోతున్నాయని అన్నారు. నాడు–నేడు పాఠశాలలు, పీహెచ్‌సీ భవనాలు, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల రూపంలో సీఎం జగన్ చేసిన అభివృద్ధి కళ్ల ముందే కనబడుతున్నాయని, చంద్రబాబు హయాంలో చేసిన అభివృద్ధి పచ్చ మీడియాలో మాత్రమే కనిపించేదని అన్నారు. గతంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉంటే.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాలన ప్రజల ఇంటి ముంగిటకే వచ్చిందని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం గ్రామంలోని 392 మంది దరఖాస్తు చేసుకోగా 364 మందికి వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేశామని, మిగిలినవి సైతం సాయంత్రానికి అందజేస్తారని అన్నారు.

పాతకొట్టాంలో రూ.2 కోట్లతో కొత్త పీహెచ్‌సీ భవనం నిర్మిస్తామని మంత్రి రాజా తెలిపారు. గడచిన నాలుగేళ్లలో ఈ గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.20.5 కోట్లు అందించామని చెప్పారు. సంగవాకలో 110 మంది గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందజేసి, సంక్షేమ పథకాలు సైతం అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం జగన్, నియోజకవర్గంలో తాను మంచి చేశామని అనిపిస్తేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని మంత్రి రాజా విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, తుని ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, ఉప సర్పంచ్ బొంగు గోపాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు దొగ్గా రామకృష్ణ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు వరం ప్రశస్త

- వారి కోసం ప్రత్యేక యాప్
- ప్రతి విద్యార్థి స్క్రీనింగ్‌కు దోహదం



భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు

జిల్లాలో భవిత కేంద్రాలు	:21
విభిన్న ప్రతిభావంతులు	:3,633
ఫిజియోథెరపిస్టులు	:6
ఐఆర్‌టీఈలు, ఆయాలు	:3,321

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. పలు పథకాలు అమలు చేస్తున్నా అవి వివిధ కారణాలతో వారికి పూర్తి స్థాయిలో అందడం లేదు. వారి ఆధార్ కార్డులో జనన తేదీలు, పేరు, చిరునామా వంటి వివరాలు తప్పుగా ఉండటం, బ్యాంక్ ఖాతా లావాదేవీలు లేకపోవడం, రేషన్, ఆధార్ కార్డుల్లో తప్పులు, లింక్ లేకపోవడం వంటి కారణాలతో సాయం అందుకోలేని పరిస్థితి ఉంది. దీనిని అధిగమించేందుకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశస్త యాప్‌ను రూపొందించింది. ఇప్పటికే ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలకు వివిధ పరికరాల సాయంతో శిక్షణ ఇచ్చేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని ఏపీ సమగ్ర శిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ పథకం ద్వారా నిర్వహిస్తున్నారు. ఇంటి వద్ద శిక్షణ పొందే పిల్లలకు విద్య, ప్రభుత్వ పథకాల లబ్ధి సైతం అందిస్తున్నారు. వారికి మరింత ప్రయోజనం చేకూరాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రశస్త యాప్‌ను తీసుకొచ్చింది.

21 రకాల వైకల్యాల నమోదు

ప్రశస్త యాప్‌లో పిల్లల వివరాల నమోదుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. వైకల్యాలను గుర్తించేందుకు 63 ప్రశ్నలు రూపొందించారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాల గుర్తింపునకు ప్రశస్త యాప్ ఉపయోగపడుతుంది. భవిత కేంద్రాల్లో ఐఈఆర్టీలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక విద్యా బోధకులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

గుర్తించాల్సిన లక్షణాలు

దృష్టి లోపం, తక్కువ దృష్టి, వినికిడి, శారీరక (చలన) వైకల్యం, మేధో మానసిక వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మెదడు పక్షవాతం (సెరిబ్రల్ పాల్సీ), ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, బహుళ వైకల్యం, లెప్రసీ బాధితులు, మరుగుజ్జుతనం, దీర్ఘకాలిక నరాల సమస్యలు, కండరాల క్షీణత, బహుళ నాడీ వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, థలసేమియా, హిమోఫిలియా (రక్తం గడ్డ కట్టని స్థితి), సికిల్‌సెల్ వ్యాధి (కొడవలి కణ రక్తహీనత) వంటి వాటిని గుర్తించి, ఈ యాప్‌లో నమోదు చేయాలి.

ప్రతి దివ్యాంగుడినీ గుర్తించేలా ఆదేశాలు



ప్రతి దివ్యాంగుడినీ విధిగా గుర్తించేలా ఇప్పటికే అందరికీ ఆదేశాలు జారీ చేశాం. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో లోపాలను గుర్తించేందుకు ఈ ప్రశస్త యాప్ దోహదపడుతుంది. వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు అందించే వీలుంటుంది.

– చామంతి నాగేశ్వరరావు, సీఎంఓ, సమగ్ర శిక్ష అభియాన్

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: ఆషాఢమాసంలో చివరి రోజు, అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. హోమంలో దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులతో సహా 36 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రత్యక్షంగానూ, మరో ఇద్దరు రూ.1,116 చొప్పున ఆన్‌లైన్‌లో టిక్కెట్టు కొనుగోలు చేసి పరోక్షంగానూ పాల్గొన్నారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, చిట్టిం వాసు, ఛామర్తి కన్నబాబు, చెళ్లపల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

ఇకపై ఆలయం దిగువన మండపంలో..

వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే చండీ హోమం, పౌర్ణమి, అమావాస్య పర్వదినాల్లో నిర్వహించే ప్రత్యంగిర హోమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. దీంతో మండపం సరిపోక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మండపం విశాలం చేయాలని లేకుంటే దిగువన గల సెల్లార్‌లో హోమం నిర్వహించాలని పలువురు భక్తులు కోరారు. ఈ విషయాన్ని పండితులు ఈఓ చంద్రశేఖర్ అజాద్ దృష్టికి తీసుకువెళ్లారు. మండపం దిగువన గల సెల్లార్‌లో హోమగుండం ఏర్పాటు చేసి చండీ, ప్రత్యంగిర హోమాలను నిర్వహించాలని ఈఓ పండితులను ఆదేశించారు.



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

రాత్రిపూట రక్తచరిత


దుండగుల చేతిలో హత్యకు గురైన పప్పు సత్యవతి (అంతరచిత్రం) సత్యవతి (ఫైల్)

- డ్రైవర్‌పై దుండగుల హత్యాయత్నం, ఆటో లాక్కుని పరారీ
- ఆపై టిఫిన్ సెంటర్‌లో మహిళ హత్య
- తేటగుంట శివారులో సంఘటన

తుని రూరల్: ఎవరో తెలియదు.. ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు.. ఇద్దరు దుర్మార్గులు రాత్రిపూట అలజడి రేపారు.. కత్తులతో భయానక వాతావరణం సృష్టించారు.. ఓ డ్రైవర్‌ను కత్తితో పొడవడమే కాకుండా మహిళను అతి కిరాతకంగా హత్య చేశారు. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు జంక్షన్ వద్ద టిఫిన్ సెంటర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దీనిపై రూరల్ సీఐ సన్యాసిరావు కథనం ప్రకారం.. ఆదివారం తొమ్మిది గంటల సమయంలో ఇద్దరు తేటగుంట జంక్షన్‌లో గుంటపల్లి వెళుతున్న ఆటో ఎక్కారు. రాజుల కొత్తూరు వద్దకు చేరుకున్న తర్వాత ఆటో వదిలి వెళ్లిపోవాలని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ దమ్ము దుర్గారావును బెదిరించారు. దీనికి తిరస్కరించడంతో దుర్గారావును కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అతనిని కిందకు తోసేసి ఆటోను తీసుకుని దుండగులు వెళ్లిపోయారు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు వెళ్లి కాఫీడే దాటిన తర్వాత ఆటోను రోడ్డు పక్కన వదిలి దగ్గరలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ కొండపైకి చేరుకున్నారు. అక్కడ రెండు గంటల సేపు దాక్కున్నారు. రాత్రి 11.30 గంటల తర్వాత కొండ దిగి ఎర్రకోనేరు వద్దకు వచ్చారు.


జరిగిన ఘటనను పోలీసులకు వివరిస్తున్న నాగమణి

పైసల్ ఇవ్వు అంటూ...

ఆ సెంటర్లో రోడ్డు పక్కనే మూసివేసి ఉన్న టిఫిన్ సెంటర్‌కు వెళ్లారు. హోటల్ ప్రాంగణంలో పప్పు సత్యవతి (55) భోజనం చేస్తుండగా ఆమె కుమార్తె, మనుమడు లోపల నిద్రిస్తున్నారు. సత్యవతిని చూసి పైసల్ ఇవ్వు అంటూ ఆ దుర్మార్గులు బెదిరించారు. 'పైసల్ లేవు ఏమీ లేవు పొండి' అంటుండగానే అప్పటికే టీషర్టులతో ముఖం కనిపించకుండా కట్టుకుని ఉన్న ఇద్దరిలో ఒకడు సత్యవతిని కత్తితో పొడిచాడు. ఆ సమయంలో లోపల నుంచి ఏంటని అడుగుతున్న సత్యవతి కుమార్తె (గత నెలలో కుడి చేయి విరిగి ఉన్న) నాగమణి వద్దకు మరో దుండగుడు వెళ్లి అరవ వద్దంటూ నోరుమూసేశాడు. నాగమణి ఒక చేత్తోనే ప్రతిఘటిస్తుండగా తల్లి సత్యవతి వెనుతిరిగి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించింది. మొదట కత్తితో దాడి చేసిన దుండగుడు సత్యవతి వీపుపై మరోసారి బలంగా పొడిచాడు. నాగమణి కేకలు వేస్తూ ఉల్లిపాయలు కోసే కత్తి తీసుకుని దుండగుడిని బెదిరించింది. అతను నాగమణి చేతిలో కత్తి లాక్కుని మెడపై పెట్టి చంపేస్తానంటూ అరిచాడు. ఈ అలజడికి పక్కింట్లో ఉంటున్న ఇద్దరు మహిళలు అక్కడకు చేరుకున్నారు. వారిద్దరిని వెళ్లిపోవాలని దుండగులు బెదిరించారు. ఆ మహిళలు వెళ్లిపోయిన వెంటనే అందుబాటులో ఉన్న ఫోన్‌ను తీసుకుని ఆ ఇద్దరూ నీరు లేని ఎర్రకోనేరులోకి దిగి నడిచి వెళ్లిపోయారు. బయటకు వచ్చిన నాగమణి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారొచ్చి అపస్మారక స్థితిలో ఉన్న సత్యవతిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రాథమిక విచారణలో దుండగులు ఒడిశా, బిహార్‌లకు చెందిన వారిగా గుర్తించామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి కొద్ది దూరంలో రెండు టీ షర్టులు, రెండు టర్కీ తువ్వాళ్లు ఉన్న సంచి వదిలి వెళ్లారు.

సహాయంగా వచ్చి.. తనువు చాలించి..

ఎర్రకోనేరు జంక్షన్‌లో కొన్నాళ్లుగా పదేళ్ల కుమారుడు చింటుతో కలసి నాగమణి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తోంది. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె కుడి చేయి విరిగిపోయింది. దాంతో అదే గ్రామంలో ఉంటున్న తల్లి సత్యవతి ఆమెకు సహాయంగా వచ్చింది. ఆ రోజు రాత్రి తుని నుంచి హోటల్‌కు వస్తుండగా ఆటో డ్రైవర్‌ను ఎవరో కత్తితో పొడిచేశారన్న విషయం తెలిసిందని నాగమణి చెప్పింది. వెంటనే మెడలోని బంగారు నగలను తీసేసి లోపల భద్రపర్చామంది. తన తల్లి భోజనం చేస్తుండగా కుమారుడితో కలసి లోపల నిద్రించానని తెలిపింది. 11.30 గంటల తర్వాత దుండగులు డబ్బు కోసం వచ్చి తన తల్లిని అతి కిరాతకంగా హత్య చేశారని నాగమణి పోలీసుల వద్ద వాపోయింది. గతేడాది తండ్రి తాతబ్బాయి మరణించగా, ఇప్పుడు ఇలా తల్లి మరణించిందని బోరును విలపించింది. ఈ సంఘటనతో ఆ ప్రాంతమంత ఒక్కసారిగా ఉలిక్కిపడింది.


దుండగులు తీసుకుపోయిన ఆటో

క్లూస్ టీమ్ ఆధారాల సేకరణ

సంఘటనా స్థలానికి కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి, రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయబాబు, పట్టణ సీఐ నాగదుర్గారావు, కోటనందూరు, తొండంగి ఎస్సైలు స్వామినాయుడు, శివకుమార్ చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. డ్రైవర్ నుంచి లాక్కున్న ఆటోను, దుండగులు వదిలివెళ్లిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తునకు ఐదు ప్రత్యేక బృందాలను నియమించారు. రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో ఓ బృందం ఒడిశా వెళ్లనుంది. మిగిలిన నాలుగు బృందాలు సమీపంలో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. సెల్ సిగ్నల్స్‌ను గుర్తిస్తున్నారు. తుని, అన్నవరం, సమీప పట్టణాల్లో లాడ్జిలలో తనిఖీలు చేస్తున్నారు.

ఫిజిక్స్ టీచర్స్ అసోసియేషన్‌తో 'నన్నయ' ఒప్పందం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆర్సీ 11 ఏపీ చాప్టర్‌కు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. స్థానిక యూనివర్సిటీ సెమినార్ హాలులో 'ఎక్స్‌ప్లోరింగ్ ది సినర్జీ: ఫిజిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' అనే అంశంపై సోమవారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. దీనికి రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ఐఏపీటీఆర్సీ-11 సెక్రటరీ ఆచార్య జి.సహాయ భాస్కరన్‌తో నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఇందుకు సంబంధించిన ఒడంబడిక పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌కు మూలం ఫిజిక్స్ అని, ఫిజిక్స్‌లోని మూలాలను అన్వేషిస్తే శాస్త్రవేత్తల కృషి అర్థమవుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా ఆయా విభాగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపించేలా విద్యార్థులకు అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. విద్యార్థులంతా ఫిజిక్స్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఈ ఒప్పందం ద్వారా వివిధ ఉమ్మడి కార్యకలాపాలు, విద్యార్థులు, ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ఫిజిక్స్‌లో జాతీయ స్థాయి పరీక్షలను ప్రోత్సహించడం, ఏపీలోని పాఠశాలలు, కళాశాలలో ఫిజిక్స్/సైన్స్ ఉపాధ్యాయుల అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం, అకడమిక్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ తదితరాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రిసోర్స్‌పర్సన్ ఆచార్య సహాయ భాస్కరన్ మాట్లాడుతూ డేటా మేనేజ్‌మెంట్‌లో మాగ్నటిక్, ఆప్టికల్ స్టోరేజ్ ప్రాముఖ్యతతో పాటు డిజిటలైజేషన్ వెనుక ఉన్న ఫిజిక్స్ భావనలను వివరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇటీవల ఎంతో పురోగతిని సాధించామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, ఆచార్య వై.శ్రీనివాసరావు, డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022–23 సంవత్సరానికి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీ లోపు ఏదైనా ఆన్‌లైన్ సెంటర్ నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అనంతరం అభ్యర్థి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఆగస్టు ఒకటవ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేయించుకోవాలన్నారు. లేకుంటే అభ్యర్థి పేరు మెరిట్ జాబితాలో అనర్హులుగా కనిపిస్తుందన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సందేహాలు వస్తే 0884 2348182, 94946 88516 ఫోన్ నంబరులలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థి చేరదలచుకున్న ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐలను తప్పనిసరిగా ఆప్షన్ పెట్టుకోవాలన్నారు. ఆగస్టు 3, 4 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐలు, ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

జార్జియాలో వైద్య విద్యార్థి అదృశ్యం

కలత చెందుతున్న తల్లిదండ్రులు


హేమంత్ అశ్విన్ ఆకాష్

ఆలమూరు: జార్జియా దేశంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సిడిగం హేమంత్ అశ్విన్ ఆకాష్ (21) అదృశ్యమయ్యాడు. ఆ వివరాల్లోకి వెళితే.. ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ (నాయుడు) తన ద్వితీయ కుమారుడైన హేమంత్‌ను 2022లో హైదరాబాద్‌కు చెందిన వీ సోర్స్ కన్సల్టెన్సీ ద్వారా జార్జియాలోని ఇల్లియా స్టేట్ గవర్నమెంట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివేందుకు చేర్పించారు. అప్పటి నుంచి కన్సల్టెన్సీ ఏర్పాటు చేసిన హాస్టల్‌లో ఉంటూ చదువుకుని సెలవులపై తరచూ స్వగ్రామమైన ఆలమూరుకు హేమంత్ వస్తుండేవాడు. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు స్వగ్రామానికి వచ్చేందుకు రానూ పోనూ విమాన టిక్కెట్లు తీసుకున్నాడు. హేమంత్‌కు చెందిన మొబైల్ ఫోన్ ఆదివారం రాత్రి నుంచి పనిచేయడం లేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తున్నా స్పందన లేకపోవడంతో ఆందోళన చెంది వీ సోర్స్ కన్సల్టెన్సీని సంప్రదించారు. దీంతో హాస్టల్‌లో ఉంటున్న సహచర విద్యార్థులను ఆ కన్సల్టెన్సీ సంప్రదించగా స్థానిక బీచ్‌కు వెళతానని చెప్పి ఒక్కడే బయటకు వెళ్లిపోయాడని, తరువాత తమకు కనిపించలేదని చెప్పడంతో తల్లిదండ్రులు సత్యనారాయణ, లలిత దంపతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన సత్వరమే స్పందించి విదేశాంగ శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

స్నేహితులపై అనుమానం

తమ కుమారుడు హేమంత్ అవినాకాష్ కనిపించకుండా పోయి 24 గంటలైనా ఇప్పటి వరకూ హాస్టల్ నిర్వాహకులు, సహచర విద్యార్థులు స్పందించలేదని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తన కుమారుడు కనిపించకుండా పోవడానికి సహచర విద్యార్థుల్లో కొంతమంది కారణమని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తన కుమారుడి ఆచూకీ తెలపాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

నైపుణ్యాభివృద్ధిరస్తు

- 12 సామర్థ్యాల్లో హెచ్‌ఎంలకు శిక్షణ
- వేదికగా సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల

రాయవరం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రధానోపాధ్యాయుల్లోనూ నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి శిక్షణ తరగతులను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఆరు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల దీనికి వేదిక కానుంది. ఇక్కడ పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం డివిజన్, అలాగే తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన హెచ్‌ఎంకు శిక్షణ ఉంటుంది. బ్యాచ్‌కు 300 మంది చొప్పున తొలుత ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు తరగతులు ఉంటాయి. అనంతరం ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తారు. ఏలూరు జిల్లా అగిరిపల్లిలో శిక్షణ పొందిన 19 మంది మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించనున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారికి అవసరమైన శిక్షణతో పాటు, మానసికోల్లాసానికి ఆటలు, పాటలు, యోగా, ధ్యానం తదితర అంశాల్లో ప్రవేశం కల్పిస్తారు. ట్రైనింగ్‌కు ముందు, ట్రైనింగ్ అనంతరం టెస్ట్‌లను నిర్వహించి, వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. అలాగే వివిధ పద్ధతుల ద్వారా నిరంతర సమగ్ర మూల్యాంకనం చేసి, వారిలో నాయకత్వ పెంపుదల సూచీని అభివృద్ధి చేస్తారు. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ కోర్సు కోఆర్డినేటర్‌గా, ఏఎంవో ఎంవీ రామారెడ్డి శిక్షణా శిబిరం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సీమాట్) పర్యవేక్షణలో రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు.



శిక్షణ అంశాలు ఏంటంటే..

2026 నాటికి పాఠశాల ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ సామర్థ్యాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ ద్వారా రాష్ట్ర విద్యా శాఖ కృషి చేస్తోంది. స్వీయ అవగాహన, స్వీయ నిర్వహణ, పాఠ్యాంశాల బోధన నిర్వహణ, అభ్యాస సంస్కృతిని ప్రోత్సహించడం, పరిశీలన మరియు అభిప్రాయం, డేటా ఆధారిత దిశలు, పాఠశాల వనరుల నిర్వహణ, ఆర్థిక వనరుల నిర్వహణ, కమ్యూనికేషన్ ప్రభావం, సంఘర్షణ నిర్వహణ, సహకారాన్ని నిర్మించడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. అలాగే పాఠశాల భద్రత, వాతావరణ మార్పు అంశాలపైనా అవగాహన కల్పిస్తారు. పాఠశాలల్లోని అవసరాలు, విశ్లేషణ ఆధారంగా సామర్థ్యాలను రెండు లెర్నింగ్ సైకిల్స్‌లో నేర్పిస్తారు. విపత్తు సమయాల్లో నిర్వహణ, పాఠశాల భద్రత అంశాల్లో ప్రధానంగా శిక్షణ ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి



"పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడే నాయకుడు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకమైంది. సాల్ట్ ప్రాజెక్టులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను సమగ్ర శిక్ష తరఫున నిర్వహిస్తున్నాం. ప్రతి ప్రధానోపాధ్యాయుడు ఈ శిక్షణను వినియోగించుకుని విద్యాభివృద్ధికి దోహదపడాలి."

–జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

బోటు బోల్తా: ఒకరి గల్లంతు


బోల్తా పడిన బోటును ఒడ్డుకు తీసుకు వస్తున్న మత్స్యకారులు

కాట్రేనికోన: కొత్తపాలెం మొగప్రాంతంలో బోటు బోల్తా పడటంతో ఒకరు గల్లంతయ్యారు. స్థానిక ఎఫ్‌డీఓ రామకృష్ణ కథనం ప్రకారం.. బలుసుతిప్పకి చెందిన కర్రి వెంకటేశ్వర్లు, కర్రి శేషాద్రి, పెమ్మాడి సత్యం, తిరుమాని సతీష్, సంగాని సత్తిబాబు, కాలాడి సత్తిబాబులు ఫైబర్ బోటుపై సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో సోమవారం తెల్లవారు జామున 4 గంటలకు కొత్తపాలెం మొగ ప్రాంతంలో బోటు ప్రమాదం జరిగింది. వరద ఉధృతి, సముద్ర కెరటాల తాకిడికి బోటు బోల్తా పడింది. బోటుపై ఉన్న ఆరుగురు సముద్రంలో ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఇందులో ఐదుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. కాలాడి సత్తిబాబు (45) కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడని సహచరులు చెబుతున్నారు. వెంటనే బలుసుతిప్ప గ్రామస్తులు, బంధువులకు చెందిన 10 బోట్లపై గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సత్తిబాబు ఆచూకీ ఇంకా తెలియ రాలేదు. సత్తిబాబుకు భార్య, కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలానికి మత్స్యశాఖ జేడీ షేక్ అహ్మద్‌అలీ, ఎఫ్‌డీఓ రామకృష్ణ వెళ్లి పరిశీలించారు. సత్తిబాబు గల్లంతుపై కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తిని పరిశీలిస్తున్న ఎస్సై మారూఫ్

తుని: రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడని రైల్వే ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. దీనిపై సోమవారం తుని రైల్వే స్టేషన్ మాస్టర్ సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. గౌహతి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి పాయకరావుపేట, నాగరాజుపేట గేటు సమీపంలో జారిపడి 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే తుని జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.